ప్రజాశక్తి
సోమవారం 30 అక్టోబర్ 2023
5
అనంతపురం

సమగ్రాభివృద్ధికై ప్రణాళికుండాలి

◆ సాగు,తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి ◆ మానవాభివృద్ధికీ చర్యలుండాలి ◆ జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో వక్తలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలను ప్రభుత్వాలు రూపొంది, వాటిని అమలుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం నాడు అనంతపురం రేడియేంట్ ఫంక్షన్ హాలులో జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సును నిర్వహించారు. 'వ్యవసాయం-నీటిపారుదల, పరిశ్రమలు-ఉపాధి, సామాజిక తరగతులు- అభివృద్ధి ఆటంకాలు, విద్యా-వైద్యం నాలుగు అంశాలపై సదస్సు జరిగింది. ఒక్కో అంశానికి సంబంధించి ఆయా రంగంల్లోని అనుభవమున్న వారు ప్రసంగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన ఈ చర్చల్లో జిల్లా సమగ్రాభివృద్ధిపై లోతుగా చర్చ జరిగింది.

'జిల్లా సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు' సదస్సులో ప్రసంగిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

ప్రత్యేక ప్రణాళికుండాలి

ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకమైన ప్రణాళికలను ప్రభుత్వాలు రూపొందించి అమలు జరిపినప్పుడే సమాగ్రాభివృద్ధి సాధ్యమవు తుందని ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ ఎమెల్సీ డాక్టర్ గేయానంద్ అధ్యక్షత వహించగా ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు ప్రారంభోన్యాసం చేశారు. ప్రభుత్వాలు అభివృద్ధి అన్న దానికే అర్థాలు మార్చేస్తున్నాయని చెప్పారు. తలసరి ఆదాయన్ని చూపించి అదే అభివృద్ధి అని చెబుతున్నాయన్నారు. ఆ రకమైన ఆర్థికాభివృద్ధి చూసినప్పుడు అది ధనవంతులు, పెట్టుబడిదారుల అభివృద్ధిగానే ఉంటోందన్నారు. ఆర్థికాభివృద్ధితోపాటు, మానవాభివృద్ధి జరిగినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని పేర్కొన్నారు. ఆర్థికాభివృద్ధిలో భారతదేశం ముందుకుపోతున్నా మానవాభివృద్ధిలో ఇప్పటికీ ఎంతో వెనుకబడి ఉందని గుర్తు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూసినప్పుడు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న శ్రీలంక 77వ స్థానంలో ఉండగా భారతదేశంలో 133వ స్థానంలో ఉందని చెప్పారు. విద్యా, వైద్యం, ఆరోగ్యం, తదితర అంశాలన్నీ మానవాభివృద్ధి సూచికలోకి వస్తాయన్నారు. సమాజంలోని అన్ని తరగతుల అభివృద్ధి సాధించినప్పుడే నిజమైన అభివృద్ధి అవుతుందని వివరించారు. ఇక రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రాభివృద్ధి మరింత కుంటుపడిందని విచారం వ్యక్తం చేశారు. విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీని కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని విమర్శించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామన్నది కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో వెనుకబడిన ఏడు జిల్లాలకు లక్ష కోట్ల రూపాయల ప్యాకేజీనివ్వాలని డిమాండ్ చేశారు.

నీటి వనరుల అనుసంధానం అవసరం

ఎస్ఎం.బాషా

అత్యల్ప వర్షపాతం కలిగిన అనంతపురం జిల్లాకు సాగు,తాగునీటి వనరులను తీసుకు రావడంతో పాలకులు ఎంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తు న్నారని నీటిరంగ నిపుణులు ఎస్ఎం.బాషా విమర్శించారు. ప్రతిపక్షంలోనున్న సమయంలో ప్రతి పార్టీ కూడా జిల్లాలో ప్రతి ఎకరానికి నీటిని అందిస్తామని హామీలిచ్చి మోసం చేస్తున్నాయన్నారు. ఈ విషయంపై ఆయా పార్టీలు, నాయకులను నిలదీయాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. ప్రశ్నించనప్పుడే జిల్లాకు సాగునీటి వనరులను రాబట్టుకోగలమని చెప్పారు. తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ, హంద్రీనీవా ప్రాజెక్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుల నీటిని సక్రమంగా వినియోగించుకునే విధంగా ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. తుంగభద్ర, హంద్రీనీవా నీటిని జిల్లాలోనున్న చెరువులు, నీటి వనరులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా కరువును తట్టుకునేందుకు వీలు ఏర్పడుతుందని సూచించారు.

పంటల సరళిలో అనేక మార్పులు

వి.రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి.

సదస్సులో భాగంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ఈ సందర్భంగా విశ్లేషించారు. జిల్లాలో పంటల సరళిలో అనేక మార్పులు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. మొదట ఆహార పంటలు అధికంగా ఉంటే 1990 దశకం నుంచి వేరుశనగ పంట ప్రధాన పంటగా జిల్లాలో మారిందన్నారు. ఇప్పుడు అది పోయి పండ్లతోటల సాగు గణనీయంగా పెరుగుతోందని వివరించారు. మారుతున్న పంటల సరళికి అనుగుణంగా తగిన ప్రోత్సహకాలను ప్రభుత్వాల వైపు నుంచి ఉండటం లేదని తెలిపారు. పండ్లతోటల సాగుకు అవసరమైన ప్రోత్సహకాలను ప్రభుత్వాలు నిలిపివేసాయన్నారు. ఇప్పటికైనా వ్యవసాయ రంగానికి రైతుల అవసరాలకు అనుగుణంగా ప్రోత్సహకం సహకారం అందించే విధంగా ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు.

నైపుణ్యతతోనే ఉపాధి అవకాశాలు

క్యాస్ట్రో కిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్

సాంకేతిక రంగంలో ఉపాధి అవకాశాలు అన్న అంశంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ క్యాస్ట్రో కిరణ్ మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఐటి రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. దీన్ని అందిపుచ్చుకోవడానికి ఇతర రంగాల్లో విద్యాభ్యాసం పూర్తి చేసిన వారు కూడా ఐటి రంగంలో ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. పూర్తి స్థాయి సాంకేతిక అందిపుచ్చుకోకుండా అడుగు పెట్టడం ద్వారా కొన్ని ఇబ్బందులూ ఎదుర్కొనే పరిస్థితులుంటున్నాయి. పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో విద్యాలయాల్లోనూ క్వాలిఫైడ్ అధ్యాకుల్లేకుండా కోర్సులను పూర్తి చేయిస్తున్నారన్నారు. ఇది కూడా ఐటి రంగంలోకి అడుగుపెట్టే వారికి సమస్యలను ఎదుర్కొనేలా చేస్తోందన్నారు. ఇలాంటి వాటిని ప్రభుత్వాలు పరిష్కరిస్తే ఉపయోగంగా ఉంటుంది.

సబ్‌ప్లాన్‌కు ప్రణాళిక అవసరం

సత్యబోస్

దళిత, గిరిజనుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కోసం నిధులు కేటాయింపులు చేశారో, ఆ నిధులన్ని పూర్తిగా వారి కోసమే ఖర్చు చేసేలా ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రజా పర్యవేక్షణ కమిటీ కన్వీనర్ సత్యబోస్ అన్నారు. సామాజిక తరగతులు- అభివృద్ధి- ఆటంకాలు అనే అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఓ.నల్లప్ప అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌కు ముఖ్య వక్తగా సత్యబోస్ మాట్లాడారు. సబ్‌ప్లాన్ కేటాయింపులు చేస్తున్న ఖర్చు మాత్రం మొత్తం చేయలేదన్నారు. సబ్‌ప్లాన్ అమలు పర్యవేక్షణ యంత్రాగం తప్పనిసరిగా ఉండాలన్నారు. మానవ జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే ఆర్థిక ఆదాయ వనరులు పెరగాలన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి, వ్యవసాయం అవకాశాలు కల్పించాలన్నారు. నిధులు ఎలా ఖర్చు చేయాలో డేటా రూపకల్పన చేయాల్సిన అవసరం ఉందన్నారు. మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్స్ పంపించి నిధులు రాబట్టే విధానం రావాలన్నారు. ప్రత్యేకంగా కేటాయించిన నిధులు దారి మళ్లించకుండా వారి కోసమే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

మహిళకు సామాజిక భద్రత కల్పించాలి

రెడ్స్ సంస్థ అధినేత్రి భానుజ

మహిళలకు అన్ని రంగాల్లో సామాజిక భద్రత కల్పించాలని రెడ్స్ సంస్థ అధినేత్రి భానుజ అన్నారు. మహిళలు- వ్యవసాయం- సామాజిక సమస్యలు అనే అంశంపై ఆమె మాట్లాడుతూ జిల్లాలో మహిళలకు ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క సామాజిక సమస్యలు ఎదురౌతున్నాయని తెలిపారు. రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో దేవదాసీ వ్యవస్థ నేటికి కొనసాగుతోందన్నారు. సామాజిక రుగ్మతల్లో వచ్చిన దాన్ని ఆర్థిక రుగ్మతగా మారిపోయిందన్నారు. కదిరి పరిసర ప్రాంతాల్లో మహిళల అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. ఉపాధి కోసం వెళ్లిన ప్రాంతాల్లో వ్యభిచార కూపంలోకి నెట్టివేయబడుతున్నారని తెలిపారు. భర్త మృతి చెందితే ఆస్తి బదలాయింపు జరగాలన్నా కుటుంబ సభ్యులతో వేదనలు ఎదురౌతున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర కీలకం అన్నారు. భూమి మీద అందరికీ హక్కు లేని పరిస్థితి ఉందన్నారు. మహిళా రైతులకు ప్రభుత్వం అందించే సౌకర్యాలు అందడం లేదన్నారు. ఒంటరి మహిళల జీవన ప్రమాణాలు దుర్భరంగా ఉంటున్నాయని తెలిపారు. ప్రభుత్వాలు మహిళ సామాజిక భద్రతకు సమాన హక్కులు కల్పించాలన్నారు.

కార్పొరేట్ విద్యను వ్యతిరేకించాలి

ఏ.చంద్రశేఖర్

అశాస్త్రీయమైన గ్రేడింగ్ విధానాలతో విద్యార్థులను మానసి స్థితిగతులను దెబ్బతీసేలా ఉన్న ర్యాంకుల పోటీ అనుసరిస్తున్న కార్పొరేట్ విద్యా వ్యవస్థను ప్రజలందరూ వ్యతిరేకించినప్పుడే ప్రభుత్వ విద్య బాగుపడుతుందని మానవ హక్కుల వేదిక రాష్ట్ర కన్వీనర్ ఏ.చంద్రశేఖర్ తెలిపారు. విద్యా- వైద్యం అంశంపై సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు వి.సావిత్రి అధ్యక్షతన నిర్వహించిన సదస్సులో జిల్లాలో విద్యా రంగం పరిస్థితి- ప్రభుత్వ విద్య అవశ్యకత అంశం ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. సమర్థవంతులైన ఉపాధ్యాయ, అధ్యాపకులు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్నప్పటికీ ప్రయివేట్ రంగంలోనే అడ్మిషన్‌లు అధికంగా ఉన్నాయన్నారు. ప్రభుత్వ కళాశాలలు, యూనివర్శిటీల్లో సీట్లు మిగిలిపోతున్నాయని తెలిపారు. జిల్లా నుంచి వేల మంది విద్యార్థులు విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో డబ్బులు వెచ్చించి చదివే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎస్‌కెయు, సెంట్రల్ యూనివర్శిటీ, జెఎన్‌టియుల్లో అడ్మిషన్‌లు తగ్గిపోతున్న పరిస్థితి ఉందన్నారు. ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులు భర్తీ చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి

ప్రజా వైద్యురాలు డాక్టర్ ప్రసూన

ప్రజల ఆరోగ్యం పరిరక్షణకు నాణ్యమైన మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకు సరిపడా వైద్యులు, సిబ్బంది, పరికరాలు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజా వైద్యురాలు డాక్టర్ ప్రసూన తెలిపారు. జిల్లాలో వైద్యం- ప్రజల పరిస్థితి- ప్రభుత్వ వైద్యం అవశ్యకత అంశంపై ఆమె మాట్లాడుతూ జిల్లాలో 50 శాతం మంది ప్రభుత్వం వైద్యం మీద ఆధారపడ్డారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చిన్నా పెద్ద ఆసుపత్రులన్నింటినీ బలోపేతం చేయాలన్నారు. జిల్లాలో సర్వజనాసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, క్యాన్సర్ ఆసుపత్రులు ఉండటం గర్వకారణం అన్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులు, టెక్నీషియన్‌లు, సిబ్బంది, పోస్టులు భర్తీ చేయాలన్నారు. చిన్న సమస్యలతో నిలిచిపోయిన యంత్రాలను బాగు చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. సబ్ సెంటర్‌లు, పిహెచ్‌సిలను పూర్తి స్థాయిలో బలోపేతం చేయాలన్నారు. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లలో వైద్యులు అందుబాటులో ఉంచి వైద్య సేవలు మెరుగుపరచాలన్నారు. ప్రభుత్వాలను కదిలించేందుకు ప్రజా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయాలి

సామాజిక వేత్త ఎం.ఇలియాజ్

ప్రభుత్వ రంగాలు, శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయాలని సామాజిక వేత్త ఎం.ఇలియాజ్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలు- పోటీ పరీక్షలు- సామాజిక సమస్యలు అనే అంశంపై ఆయన మాట్లాడుతూ పాలక ప్రభుత్వాలు ఇస్తున్న హామీలు అమలుకు పొంతన లేకుండా పోతున్నాయని తెలిపారు. జాబ్ క్యాలెండర్ ఎన్నికల మ్యానిఫెస్టోగా మారిపోతున్నాయి తప్పా నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. పాలకులు తెలివిగా ప్రయివేట్ కంపెనీలు తెచ్చి ఉద్యోగాలు కల్పిస్తున్నామని ఊదరగొడుతున్నారని, ప్రయివేట్ ఉద్యోగాల్లో అభద్రతా భావం నెలకొందన్నారు. ఎపిపిఎస్సీ నోటిఫికేషన్‌ను అభ్యర్థులు మరిచిపోయే పరిస్థితి ఉందన్నారు. లక్షల్లో పోటీ ఉంటే వందల సంఖ్యల్లో పోస్టులకు నోటిఫికేషన్‌లు ఇస్తున్నారని తెలిపారు. బ్యాక్‌లాక్ పోస్టుల ఊసే లేదన్నారు. ప్రభుత్వాలు తమ బాధ్యతను నిర్వర్తించి నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి రూ.5 వేలు ఇవ్వాలన్నారు. గ్రూప్స్1, 2 పోస్టులు ఖాళీలన్నింటిని భర్తీ చేయాలన్నారు. పోటీ పరిక్షల కోసం స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలన్నారు.

ప్రోత్సాహకాలు అవసరం

బావయ్య, ప్రొఫెసర్

సదసుస్సులో భాగంగా పరిశ్రమలు- ఉపాధి అంశంపై ప్రొఫెసరు బావయ్య ప్రసంగించారు. కోవిడ్ సమయంలో చిన్న, సూక్ష్మతరహా పరిశ్రమలు పెద్దఎత్తున దెబ్బతిన్నాయని గుర్తు చేశారు. వీటిని తిరిగి గాడిలో పెట్టేందుకు అనేక పథకాలను ప్రభుత్వ స్థాయిలో తీసుకు వచ్చే ప్రయత్నం జరుగుతోందన్నారు. అయితే వీటి పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. అవగాహన కల్పించకుంటే వీటి వల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదని తెలియజేశారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమల స్థాపనకు అవకాశాలు అపారంగా ఉన్నాయని తెలిపారు. వీటిపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించేలా ప్రభుత్వాలు బాధ్యత తీసుకోవాలన్నారు.

ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

◆ ప్రయాణికుల భద్రతకు పెద్దపీట ◆ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆర్టీసీ బస్సు ప్రయాణం ఎంతో సురక్షితం అని, సమయానికి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ పేర్కొన్నారు. ఆర్టీసీ అతిపెద్ద సంస్థగా రవాణా రంగంలో నిలిచింది. మారుతున్న కాలానుగుణంగా ఆర్టీసీలో పెను మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రస్తుతం మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. ప్రయివేటు వాహనాల్లో కిక్కిరిసిన ప్రయాణికులతో పాటు ప్రమాదాలకు గురవుతున్న సంఘటనలు ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో ఆర్టీసీ ప్రయాణం క్షేమం' అని ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి మధుసూదన్ తెలియజేశారు. ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖిలో ఆయన పలు అంశాలను తెలియజేశారు.

ప్రశ్న : సత్యసాయి జిల్లాలో ఎన్ని ఆర్టీసీ బస్సు సర్వీసులు ఉన్నాయి.? డిపోలు ఎన్ని.? సిబ్బంది ఎంత మంది పనిచేస్తున్నారు

డిపిటిఒ : జిల్లాలో మొత్తం 397 బస్సు సర్వీసులు ఉన్నాయి. కొత్త జిల్లాలో ఆరు డిపోలు ఉన్నాయి. పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, హిందూపురం డిపోలు ఉన్నాయి. 1600 మంది సిబ్బంది పని చేస్తున్నారు. సిబ్బంది కొరత లేదు. పుట్టపర్తి డిపోలో 50 బస్సులు ఉన్నాయి.

ప్రశ్న:కొత్త బస్సులు రానున్నాయా? జిల్లా కేంద్రానికి నూతన బస్సు సర్వీసులు ఏర్పాటు చేస్తున్నారా?

డిపిటిఒ : కొత్తగా 42 అద్దె బస్సులు రానున్నాయి. అవసరమైన డిపోలకు వాటిని సర్దుబాటు చేస్తాం. అన్ని డిపోల నుంచి లింకు సర్వీసులు ఉన్నాయి. కదిరి, ధర్మవరం డిపోల నుంచి చాలా సర్వీసులు తిరుగుతున్నాయి. పెనుకొండ, హిందూపురం డిపోల నుంచి కొత్తచెరువు లింకు సర్వీసులు ఉన్నాయి. మడకశిర నుంచి ఒక్క సర్వీస్‌ను నడుపుతున్నాము. గోరంట్ల నుంచి ఒక్క సర్వీస్‌ను పుట్టపర్తికి నడుపుతున్నాం. పుట్టపర్తి నియోజకవర్గంలోని అమడగూరు మండల కేంద్రం నుంచి కూడా ఒక సర్వీస్‌ను నడుపుతున్నాం. జిల్లాలో ఆయా ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి మేరకు బస్సు సర్వీసులు నడపడానికి చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: బెంగళూరు, ఇతర నగరాలకు సరిపడ సర్వీసులు ఉన్నాయా.?

డిపిటిఒ : వైట్ ఫీల్డ్‌కు ఒక సర్వీస్ ఉంది. ఇటీవలనే బెంగళూరుకు మరొక బస్సును వేసాం. విజయవాడ, ఒంగోలు, తిరుపతి, చెన్నై, హైదరాబాద్‌కు సర్వీసులు ఉన్నాయి. బెంగళూరుకు ప్రయాణికుల రద్దీని బట్టి సర్వీసులు నడుపుతాం.

ప్రశ్న: జిల్లా వ్యాప్తంగా రోజు ఎన్ని కిలోమీటర్లు సర్వీసులు నడుస్తాయి.? రాయితీల మాటేమిటి.?

డిపిటిఒ : జిల్లా వ్యాప్తంగా రోజూ సుమారు 1.50 లక్షల కిలోమీటర్లు బస్సు సర్వీసులు నడుస్తాయి. దాదాపు లక్ష మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. గతంలో క్యాట్ కార్డులు, వనిత కార్డులు లాంటి రాయతీలను సంస్థ రద్దు చేసింది. సిటిజన్స్ మాత్రం 25 శాతం రాయితీతో జర్నలిస్టులకు ఉచిత పాసులు, విద్యార్థులకు రాయితీతో పాసులు మంజూరు చేస్తున్నాం. పదవ తరగతి, ఇంటర్ పరీక్షలను దష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నాం.

ప్రశ్న: కాలం ముగిసిన సర్వీసులు నడుపుతున్నారనే వాదన పై మీ అభిప్రాయం.?

డిపిటిఒ : కాలం ముగిసిన బస్సులను నడిపే ప్రసక్తే లేదు. ఒక్కో బస్సు 15 ఏళ్ల సర్వీస్ ఉంటుంది. ప్రతి డిపోలోను గ్యారేజీ ఉంటుంది. డ్రైవర్ బస్సు దిగగానే బస్సు కండిషన్ ఎప్పటికప్పుడు గ్యారేజీ వారికి రిపోర్ట్ చేస్తాడు. దానికి అనుగుణంగానే వెంటనే మరమ్మతులు చేయడానికి ప్రత్యేక మెకానిక్‌లు ఉన్నారు. ప్రతిరోజూ జరిగే ప్రక్రియ ఇది. ఎప్పటికప్పుడు బస్సులు కండిషన్‌లో ఉంచడానికే చర్యలు తీసుకుంటన్నాం.

మధుసూదన్ ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి

ప్రశ్న:నూతన జిల్లాలో ఆర్టీసీని లాభాల బాటలో నడపడానికి ఏం చర్యలు తీసుకుంటున్నారు.? ప్రయాణికులకు మీరిచ్చే సలహా ఏమిటి?

డిపిటిఒ : గత నెలలో 12 కోట్లు ఆదాయం ఉంటే ఒక నెలలోనే రెండు కోట్లు ఆదాయం పెరిగింది. సంస్థ ఇంకా నష్టాల్లోనే ఉంది. దీనిని అధిగమించడానికి కషి చేస్తున్నాం. ఇంధన పొదుపు పాటించడం, 5.30 కెఎంపిఎల్ నుంచి 5.50 కెఎంపిఎల్ ఆదాయం తెచ్చి ప్రతిభ చూపుతున్న డ్రైవర్లు, కండెక్టర్లకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందించి ప్రోత్సహిస్తున్నాం. ఆర్టీసీ ప్రయాణం ఎంతో సురక్షితమైనదని, సమయపాలన పాటిస్తూ సమయానికి గమ్యస్థానం చేరుకునేందుకు అవకాశం ఉంది. ప్రయాణికులు ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి ప్రమాదాలు కొని తెచ్చుకోకుండా ఆర్టీసీలోనే ప్రయాణించాలని సూచిస్తున్నాం. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ ద్వారా కార్గో పార్సిల్ సర్వీసులు ప్రారంభించాం. 84 డిపోల నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ సౌకర్యం ఉంటుంది. ప్రజల పార్సిళ్లను వారి ఇంటికే చేర్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. శుభకార్యాలకు బస్సులు పంపుతామన్నామని, ప్రజలు దీనిని వినియోగించుకోవాలని కోరుతున్నాం.

జగన్‌రెడ్డి అరాచక పరిపాలనను సాగనంపుదాం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో వైఎస్.జగన్ నేతృత్వంలోని దుర్మార్గమైన వైసిపి పాలనను సాగనంపేందుకు ప్రజలను చైతన్యం కల్పించి సమిష్టిగా పని చేద్దామని టిడిపి, జనసేన పార్టీ సమన్వయ కమిటీ నాయకులు కాలవ శ్రీనివాసులు, చిల్లపల్లి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని కమ్మభవన్‌లో టిడిపి, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ జగన్ అరాచక పాలనను ఎండగట్టేందుకు ఐక్య పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. అందుకోసమే టిడిపి, జనసేన పార్టీలు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంగా పని చేసేలా తీర్మాణాలు చేశామన్నారు. నవంబర్ 1వ తేదీ నుంచి భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో టిడిపి, జనసేన పార్టీ ఉమ్మడి ప్రభుత్వంలో ప్రజలకు ఒనుగూరే మేళ్ల గురించి తెలియజేప్పేలా ఉమ్మడి కార్యచరణ ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగం వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందన్నారు. పంటలు ఎండినా ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులకు స్పందన లేదన్నారు. రైతులను గాలికి ఒదిలేసిందన్నారు. అందుకోసం రైతులకు మద్దతుగా క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రతినిధి బృందాలు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 4న గుంటూరు, 5న కర్నూలు, 6న అనంతపురం, 7న శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటనలు చేయనున్నట్లు తెలిపారు. వీటిలో జనసేన, టిడిపి నాయకులు భాగస్వాములు కావాలని కోరారు. నిత్యావసర ధరలు, విద్యుత్ కోతలు, మద్య నిషేదం పేరుతో చేసిన మోసాలు, రాయలసీమకు ద్రోహం చేసే కృష్ణ జలాలు కేటాయింపులపై, వైసిపి దుర్మార్గపు పాలనపై పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. జనసేన నాయకులు చిల్లపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు కోసం టిడిపి, జనసేన పార్టీల కూటమి ఏర్పడిందన్నారు. ముఖ్యంగా టిడిపి కంచుకోటగా ఉమ్మడి అనంతపురం జిల్లా నిలిచిందన్నారు. రాబోవు ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి జిల్లాగా ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించేలా ప్రజల మద్దతు కూడగడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు బికె.పార్థసారథి, ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, మాజీమంత్రి పరిటాల సునీత, మాజీ ఎమ్మెల్యేలు వైకుంఠం ప్రభాకర్‌చౌదరి, ఉన్నం హనుమంతరాయచౌదరి, జితేంద్రగౌడ్, ఈరన్న, టిడిపి యువనాయకులు పరిటాల శ్రీరామ్, ఉమా మహేశ్వరనాయుడు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదర్ చౌదరి, టిడిపి జిల్లా ప్రచార కార్యదర్శి వెంకటరాముడు, సవితమ్మ, ద్విసభ్య కమిటి సభ్యులు ముంటి మడుగు కేశవరెడ్డి, ఆలం నరసానాయుడు, ఆదేన్న, ఆదికేశవ నాయుడు, జనసేన జిల్లా అధ్యక్షుడు టిసి.వరుణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చిలకం మధూసూదన్‌రెడ్డి, కార్యనిర్వాహణ కార్యదర్శి భవానీ రవికుమార్, రాయలసీమ మహిళా విభాగం నాయకురాలు పెండ్యాల శ్రీలత, జిల్లా ఉపాధ్యక్షుడు అంకే ఈశ్వరయ్య, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసమే టిడిపి-జనసేన కూటమి
ఇరుపార్టీల సమన్వయ కమిటీ నాయకులు

టిడిపి, జనసేన పార్టీల సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

వైసిపి పాలనలో వాల్మీకులకు పెద్దపీట : మంత్రి ఉషశ్రీచరణ్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

వైసిపి పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని వాల్మీకులకు పెద్దపీట వేశారని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం ఆమె ఎమ్మెల్సీ మంగమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య, వాల్మీకి ఫెడరేషన్ ఛైర్మన్ పొగాకు రామచంద్రతో కలిసి వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా పూర్ణకుంభాలతో పట్టణంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరాముడు లాంటి మహనీయుడి చరిత్రను మానవాళికి అందించిన గొప్ప వ్యక్తి, మన భారతదేశ చరిత్రను ప్రపంచానికి చాటిన మహామూర్తి వాల్మీకి అన్నారు. సిఎ జగన్ ప్రభుత్వంలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ వాల్మీకులను గుర్తించి పార్టీలో పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన వాల్మీకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

జగనన్న గృహ నిర్మాణాల పేరుతో భూ ఆక్రమణ

'స్పందన'లో ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు ఓ రైతు ఆవేదన

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

మండలంలోని కొనుగుంటపల్లి గ్రామంలో జగనన్న గృహ నిర్మాణాల పేరుతో తమ భూమి ఆక్రమించారంటూ కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనగుంటపల్లి గ్రామ పొలం సర్వే నెంబర్ 304-డిలో 2.70 ఎకరాల భూమిలో జగనన్న గృహ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈభూమి సుమారు ఆరుగురికి చెందింది. ఇందులో తమకు చెందిన 25 సెంట్ల కూడా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని రైతు చంద్రశేఖర్‌రెడ్డి వాపోతున్నాడు. స్థలం తమదేనని అనేకమార్లు కలెక్టర్, ఆర్డీవో, తహశీల్దార్లకు స్పందన కార్యక్రమంలో అనేకమార్లు మొరపెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. చేసేదిలేక 2023 ఆగస్టులో హైకోర్టును ఆశ్రయించగా 22381 రిప్యుటేషన్ నెంబర్‌తో ఫైల్ చేసిందన్నారు. ఇందుకు సంబంధించి స్టే వచ్చిన విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయినా ఇళ్ల నిర్మాణాలను ఆపలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేసి తమ భూమిలో జరుగుతున్న నిర్మాణాలను ఆపాలని రైతు చంద్రశేఖర్‌రెడ్డి కోరాడు.

కొనసాగుతున్న జగనన్న గృహ నిర్మాణాలు, (ఇన్‌సెట్‌లో) భూమి ఆక్రమణకు గురైన బాధిత రైతు చంద్రశేఖర్ రెడ్డి

రాచనగౌడ్ సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

వజ్రకరూరు మండల జెసిఎస్ మండల కన్వీనర్, వైసిపి సీనియర్ నాయకులు పాటిల్ రాచనగౌడ్ సేవలు మరువలేనివని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి కొనియాడారు. గూళ్యపాళ్యం గ్రామానికి చెందిన రాచనగౌడ్ నెల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 17న మృతిచెందాడు. దీంతో ఆదివారం వజ్రకరూరు మండల కేంద్రంలో ఏర్పాటు సంతాప సభలో రాచనగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ రాచనగౌడ్ అనతికాలంలోనే పార్టీ బలోపేతానికి విశేష కృషి చేశారన్నారు. అలాంటి నాయకుడు మృతిచెందడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు వీరన్న, వైసిపి మండల అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, పిఎసిఎస్ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, సర్పంచులు లక్ష్మయ్య, శివాజీనాయక్, సురేంద్ర, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, కురుబ, ఎంబిసి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి.వెంకటేష్, ఉరవకొండ వైస్ ఎంపిపి నరసింహులు, జెసిఎస్ మండల కన్వీనర్ ఉస్మాన్, ఎంఎల్‌ఓ తేజేశ్వర్‌రెడ్డి,ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షులు ప్యాపిలి కృష్ణ, ప్యాపిలి సచివాలయ కన్వీనర్ ప్యాపిలి భీమా, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

రాచనగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, నాయకులు

అంగన్‌వాడీ సెంటర్లకు నాసిరకం ఆహారం సరఫరా

మహిళా సమైక్య కార్యదర్శి పార్వతి ప్రసాద్

ప్రజాశక్తి-ఉరవకొండ

అంగన్‌వాడీ సెంటర్లకు రాష్ట్ర ప్రభుత్వం నాసిరకమైన, విషతుల్యమైన ఆహారాన్ని సరఫరా చేస్తోందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఉరవకొండ తాలూకా ప్రధాన కార్యదర్శి పార్వతి ప్రసాద్ ఆరోపించారు. ఆదివారం ఉరవకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం పిల్లలకి అందిస్తున్న చిక్కీల్లో పురుగులు, ముక్కిపోయిన కోడిగుడ్లు, ముక్కిపోయిన బియ్యం, ఖర్జూరాల్లో రాళ్లు ఉన్న వాటిని సరఫరా చేస్తోందన్నారు. దీనివల్ల పిల్లలు ఆరోగ్యం చెడిపోతోందన్నారు. తాము అనేక అంగన్‌వాడీ సెంటర్లను పరిశీలించామని, అనేక సెంటర్లలో ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు. అంతేగాకుండా కోడిగుడ్లు, ఆహార ప్యాకెట్లపై సీఎం బొమ్మ వేసుకోవడంలో ఉన్న శ్రద్ధ నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో లేకుండా పోయిందన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ విషతుల్యమైన పోషణగా మారిందన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీచరణ్ జిల్లాకు చెందినప్పటికీ ఇలాంటివి జరగడం శోచనీయమన్నారు. ఆహారాన్ని సరఫరా చేసే కాంట్రాక్టర్లును బ్లాక్లిస్టులో పెట్టాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ సెంటర్లకు నాణ్యమైన ఆహార పదార్థాలను సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

యువజన విభాగం విడపనకల్ మండల అధ్యక్షులుగా సిద్ధార్థ

ప్రజాశక్తి-ఉరవకొండ

విడపనకల్ మండల వైసిపి యువజన విభాగం అధ్యక్షులుగా డి.సిద్ధార్థ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడపనకల్ మండలంలో వైసిపిని బలోపేతం చేయడానికి తనువంతు కృషి చేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో యువజన విభాగం అధ్యక్ష పదవి కేటాయించిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి, యువజన విభాగం జోనల్ అధ్యక్షులు ప్రణయ్‌రెడ్డి, సహకరించిన మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో విడపనకల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. అన్నిగ్రామాల్లో ప్రజాప్రతినిధులను పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలో విశ్వేశ్వరరెడ్డి గెలుపునకు కృషి చేస్తామని తెలిపారు.

వివాహానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని టి.కొత్తపల్లి గ్రామంలో ఓ యువతి వివాహానికి ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ఆదివారం ఆర్థికసాయం చేశారు. టి.కొత్తపల్లి గ్రామంలో 8 ఏళ్ల క్రితం వైసీపీ కార్యకర్త ఓబుళరెడ్డి మరణించారు. ప్రస్తుతం అతని కుమార్తె వివాహం నిశ్చయమైంది. దీంతో తన క్యాంపు కార్యాలయంలో ఓబుళరెడ్డి భార్య గంగమ్మకు రూ.51వేలు అందజేశారు. వైసిపి కార్యకర్తలకు తాము అండగా ఉంటామని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు జోనాల రామకృష్ణ, సూరి, తిప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

నేడు నార్పలలో 2కే రన్

నార్పల : పోలీస్ అమరవీరుల దినోత్సవ సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలల పాఠశాల నుంచి గూగూడు రోడ్డుకు ఉదయం 6:30 గంటలకు 2కె రన్ నిర్వహించనున్నట్లు ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, ఉద్యోగులు, పాత్రికేయులు, క్రీడాకారులు, యువకులు, విద్యార్థులు హాజరై టూ కే రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడి దుర్మార్గం

సిపిఐఎంఎల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

గాజా దేశంపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడి దుర్మార్గమని, యుద్ధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిపిఐఎంల్ జిల్లా కార్యదర్శి సి.పెద్దన్న అన్నారు. ఆదివారం ఆ పార్టీ ఆధ్వర్యంలో గాజాపై అమెరికా మద్దతు ఇస్తున్న ఇజ్రాయిల్ దేశం చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ నగరంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇజ్రాయిల్ గాజాపై అక్టోబర్ 7వ తేదీ నుండి చేస్తున్న దుర్మార్గపు యుద్ధాన్ని వారి విధానాలను ఖండిస్తున్నామని తెలిపారు. యుద్ధం తక్షణమే ఆపి మానవత్వాన్ని కాపాడాలన్నారు. గాజా ప్రజలకు సంఘీభావంగా నిలుద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు పి.చంద్రశేఖర్, సుధాకర్, రామాంజనేయులు, బాలు, స్త్రీ విముక్తి సంఘటన జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షురాలు వెంకటలక్ష్మి, రాజమ్మ, రాధ, సరళ తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఐఎంల్ నాయకులు

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎపిఎస్ ఆర్టీసీ డ్రైవర్‌పై దుండగుల దాడిని ఖండిస్తూ ఆదివారం స్థానిక డిపో ఆవరణలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్, ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసన తెలిపారు. కావలిలో ఎపిఎస్ ఆర్టీసీ డ్రైవర్‌పై దుండగుల దాడిని ఖండిస్తూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయదుర్గం డిపోలో ఆదివారం ఉదయం 5 గంటల మొదటి సర్వీసు నుంచి ఎన్ఎంయుఎ సభ్యులు, ఉద్యోగులు 'నల్ల బ్యాడ్జీలు' ధరించి విధులకు హాజరయ్యారు. డ్రైవర్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ, డ్రైవర్‌కు సంఘీభావం తెలుపుతూ, నిరంతరం ప్రజల మధ్య విధులు నిర్వహించే ఆర్టీసీ ఉద్యోగులపై దౌర్జన్యం చేస్తే సహించబోమని హెచ్చరించారు. దాడికి పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన అల్లరిమూకలపై కఠినచర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి హెచ్‌టి స్వామి, ఉద్యోగులు వేణుగోపాల్, రామచంద్ర, మైలారప్ప, రామాంజనేయులు, శివుడు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు రాయదుర్గం డిపోలో గేట్ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో రాయదుర్గం డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు శ్రీరాములు, బాషా, డిపో ట్రెజరర్ రెడ్డి, రిజనల్ కమిటీ సభ్యులు జగదీష్, కేశన్న, లతీఫ్, రెడ్డి, రాధాకృష్ణ, స్వామి, నాయక్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

రాయదుర్గంలో నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగులు

గుత్తి : కావలిలో ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్ పై దాడికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించాలని ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రధాన గేటు వద్ద ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగ సంఘాల నాయకులు, కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులను గమ్యం చేర్చే ఆర్టీసీ డ్రైవర్ రామ్‌సింగ్ పై దాడి పాల్పడడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైవర్ పై దాడి పాల్పడ్డ ప్రతి ఒక్కరిపై శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రీజినల్ ఉపాధ్యక్షులు డి.హుసేన్ సాహెబ్, డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్. ఆంజనేయులు, సిసిఎస్ డెలిగేట్ పీకే.రాముడు, ఎడిసి బెల్లం శ్రీనివాసులు, సీనియర్ నాయకులు హెచ్‌ఎండి.అరీఫ్, జేపీ.రాముడు తదితరులు పాల్గొన్నారు.

గుత్తిలో నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

పక్కాగా సంక్షేమ పథకాల అమలు

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-నార్పల

రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పక్కాగా అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం మండలంలోని గుంజేపల్లి, నల్లపరెడ్డిపల్లి, ఎచ్.సోదనపల్లి, మంగపట్నం గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు సంక్షేమ పథకాల అమలుపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న పాలన సంతృప్తికరంగా ఉందంటూ లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి సిఎం జగన్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రజలకు అందిస్తున్న సంక్షేమాన్ని చూసి ప్రతిపక్షాలు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రాష్ట్రం అభివృద్ధి కావాలన్నా ప్రజలు సంతోషంగా ఉండాలన్నా మరోసారి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎంఇఎంఎస్ రాష్ట్ర డైరెక్టర్ నిట్టూరు రఘునాథరెడ్డి, ఎంపిపి నాగేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, ఎంపిటిసి కాటమయ్య, సర్పంచి రాంభూపాల్, కో ఆప్షన్ సభ్యుడు సాబీరా, వైసీపీ నాయకులు ఈరన్న, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

దశలవారీగా ఇళ్ల స్థలాలను చూపుతాం : వైసిపి

ప్రజాశక్తి-ఉరవకొండ

సర్వే నెం.589-5లో ఇళ్ల పట్టాల హామీ పత్రాలు తీసుకున్న లబ్ధిదారులకు దశలవారీగా ఇళ్ల స్థలాలు చూపుతామని వైసిపి నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, వైఎస్ ఎంపీపీ నరసింహులు మాట్లాడుతూ కోర్టు వివాదంలో ఉన్న దాదాపు 560 మంది ఇళ్ల పట్టాలకు సంబంధించి సమస్య తీరిందన్నారు. మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి లబ్ధిదారులకు ఇచ్చి మాట ప్రకారం కంపచెట్లు తొలగింపు పనులు వేగవంతంగా పూర్తి చేశామన్నారు. దీంతోపాటు నెంబర్ రాళ్లను కూడా పాతించి లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపడానికి రెవెన్యూ అధికారులు చురుగ్గా పనులు చేస్తున్నారన్నారు. కావున సోమవారం 589-5 సర్వేనెంబర్‌లో సిఎం జగన్ ప్రభుత్వ హయంలో హామీ పత్రాలు పొందిన 10, 11, 12, 13, 14వ వార్డు లబ్ధిదారులు మాత్రమే ఉదయం 10 గంటలకు కొలిమి లే అవుట్లలో స్థలాల వద్దకు రావాలన్నారు. తిరిగి బుధవారం 603, 60ఎ, 628 సర్వే నెంబర్లలో స్థలాలు చూపుతామని వివరించారు. దశలవారీగా లబ్ధిదారులకు ఇంటి స్థలాలు చూపించి వారికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి సూచన మేరకు అధికారులు పక్కా ఇళ్లు కూడా మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి వన్నప్ప, కురుబ, ఎంబీసీ కార్పోరేషన్ల డైరెక్టర్లు గోవిందు, జోగి.వెంకటేష్, జెసిఎస్ కన్వీనర్ ఆసిఫ్,పార్టీ ఉపాధ్యక్షుడు ఈడిగ ప్రసాద్, ఎంపీటీసీ హోన్నూరుసాబ్, పచ్చి రవి, ఎం.ఎ.జిలాన్, శంకర, ఉలిగప్ప, అయ్యర్ దాదు, రఫిక్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

40 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలోని అంబేద్కర్ కాలనీకి చెందిన 40 కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరాయి. ఆదివారం టిడిపి అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో అనంతపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్‌చౌదరి వారికి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన 40 కుటుంబాలు పార్టీలోకి రావడం చాలా సంతోషమని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో అందర్నీ కలుపుకుని సమిష్టిగా పని చేయాలని సూచించారు. పార్టీలో ఎర్రి స్వామి, శివకుమార్, జగదీష్, కుమార్, దేవరాజు, చందు,మధు, రాజేంద్ర, శివ ప్రకాష్, అనిల్ కుమార్, వాసు, వర్మ ,తిరుపతి, సుధీర్, అభి, ఎలీషా, పెద్దన్న, రేవతి, అరుణ, భారతి, శిరీష, కావేరి తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు సాకే వెంకటేష్, టిడిపి నగర అధ్యక్షుడు మారుతి కుమార్ గౌడ్, రాష్ట్ర నాయకులు దేవళ్ల మురళి, చిరోళ్ల రామాంజనేయులు, సాకే చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

పిల్లిగుండ్ల కాలనీలో పోలీసు తనిఖీలు

రికార్డులు లేని ఆటోలు, మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు రూరల్ డీఎస్పీ శివారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పిల్లిగుండ్ల కాలనీలో ఆదివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానాస్పద వ్యక్తులు, అసాంఘిక శక్తులు ఉంటారన్న అనుమానంతో ఆదివారం ఉదయం 5 గంటలకే పోలీసులు పిల్లిగుండ్ల కాలనీకి చేరుకున్నారు. ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, శింగనమల సీఐ అస్రఆర్ బాషా, రూరల్ సీఐ రాజశేఖర్, గార్లదిన్నె, రాప్తాడు, రూరల్, నార్పల ఎస్ఐలతో సహా దాదాపు 70 మంది స్పెషల్ పార్టీ పోలీసులు కాలనీలోని ప్రతి ఇంటినీ సోదించారు. ఇందులో భాగంగా సరైన ధ్రువపత్రాలు లేని ఆరు ఆటోలు, 14 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రౌడీ షీటర్లు, కాలనీ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివారెడ్డి మాట్లాడుతూ రౌడీ షీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు తమ ప్రవర్తనను మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించి తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

పిల్లిగుండ్ల కాలనీవాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ శివారెడ్డి, స్వాధీనం చేసుకున్న వాహనాలు

డాబాలు, హోటళ్లపై దాడులు

అనంతపురం క్రైం : ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు అక్రమ మద్యం నియంత్రణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌లో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా ఉన్న డాబాలు, హోటళ్లలో దాడులు చేపట్టారు. ఇందులో భాగంగా డాబాలు, హోటళ్లలో అక్రమంగా మద్యం వినియోగించకుండా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా తనిఖీలు నిర్వహించారు. అంతేగాకుండా పార్కులు, శివారు ప్రదేశాలు, వర్నలబుల్ ప్రాంతాల్లో మద్యం వినియోగించకుండా ప్రత్యేక నిఘా వేసి తనిఖీలు చేశారు. వీటితోపాటు కర్నాటక మద్యం జిల్లాలోకి అక్రమ రవాణా, విక్రయాలు జరుగకుండా జిల్లా అంతటా తనిఖీలు, దాడులు చేశారు. వీటితోపాటు లాడ్జీల్లో తనిఖీలు చేపట్టారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య

గార్లదిన్నె : మండలంలోని పాపినేపాల్యం, పి.కొత్తపల్లి, కల్లూరు గ్రామాల్లో ఆదివారం వేర్వేరు కారణాలతో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాపినేపాలెం గ్రామానికి చెందిన ఐశ్వర్య (16) ఉదయం 10 గంటలకు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఐశ్వర్య సొంత గ్రామం పెనకచర్ల. అయితే ఆమె అమ్మమ్మ వారింట్లో ఉండి కూలి పనులకు వెళ్తూ ఉండేది. ఈమె కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతూ ఉండేది. ఈనేపథ్యంలో ఆదివారం తీవ్ర కడుపునొప్పి రావడంతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కూతురు మరణంతో తల్లి లలితమ్మ, తండ్రి రాము కన్నీటి పర్యంతవయ్యారు. అలాగే పి.కొత్తపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో యల్లమ్మ (47) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. యల్లమ్మకు భర్త రాజశేఖర్‌తోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కల్లూరు గ్రామంలో రైలు కింద పడి లోలూరు రమేష్ (45) ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు.

ఆత్మహత్య చేసుకున్న ఐశ్వర్య, యల్లమ్మ

ఇసుక టిప్పర్ పట్టివేత

తాడిపత్రి రూరల్ : ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని ఆదివారం పట్టుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. అక్రమ ఇసుక రవాణాపై సిబ్బందితో కలిసి దాడులు నిర్వహిస్తుండగా తాడిపత్రి-బుగ్గ ప్రధాన రహదారిపై సజ్జలదిన్నె గ్రామం వద్ద అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను సీజ్ చేయడంతోపాటు డ్రైవర్ వేణుగోపాల్‌రెడ్డిని అరెస్టు చేసి వాహనాన్ని రూరల్ అప్‌డేట్ పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు సెబ్ అధికారులు వెల్లడించారు.

కేబుల్ వైర్ చోరీ

పుట్లూరు : రెండు మోటార్ల కేబుల్ వైర్ చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పుట్లూరుకు చెందిన రైతు బిసి నారాయణరెడ్డి ఉదయాన్నే పొలం వద్దకు వెళ్లి మోటార్ ఆన్ చేయడానికి ప్రయత్నించగా రెండు మోటార్ల కేబుల్ వైర్ లేకపోవడంతో చోరీకి గురైనట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

రాష్ట్రంలో న్యాయం, ధర్మం సమాధి చేసే కుట్ర

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్రంలో న్యాయం, ధర్మాన్ని సమాధి చేసే కుట్ర జరుగుతోందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు తెలిపారు. 'జగన్‌కు కళ్లు తెరిపిద్దాం' పేరిట టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని కాలవ నివాసం వద్ద తెలుగుతమ్ముళ్లు కళ్లకు నల్ల రిబ్బన్లతో గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కాలవ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ నాయకత్వంలో చీకటి పాలన కొనసాగుతోందని, ఆయన న్యాయవ్యవస్థను నాశనం చేస్తూ, సమాధి కట్టేందుకు కుట్ర పన్నుతున్నట్లు ఆరోపించారు. చంద్రబాబును అరెస్టు చేసి 51 రోజులైనా ఇప్పటికీ కోర్టులో ఏ విషయం తేల్చలేదన్నారు. జగన్ న్యాయ వ్యవస్థను స్వార్థానికి వాడుకుంటున్నారని, వాదనల పేరిట కోట్లాది రూపాయల ప్రభుత్వ సొమ్మును ఖర్చు పెడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాగరాజు, మహబూబ్‌బాషా, వెంకటేశులు, కౌన్సిలర్ ప్రశాంతి, భారతి, తిప్పయ్య, ప్రవీణ్, అంజి, జమీల్‌ఖాన్, కిరణ్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

నార్పల : మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాలలో 1988-89లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదివేటప్పుడు ఉన్న పలువురు ఉపాధ్యాయులు చెక్ వీరాచారి, వెంకటస్వామి, తిరుపాలు, మల్లేష్, కృష్ణారెడ్డిని సత్కరించారు. పలువురు అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ స్నేహితుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 35 సంవత్సరాలు క్రితం కలిసి చదువుకున్న అందరూ పాఠశాల ఆవరణలో కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఖాదర్‌వలీఖాన్, సెక్షావలి, సిద్ధయ్య, రాజారెడ్డి, కిష్టయ్య, భాస్కర్‌రెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, ఇక్బాల్, మస్తాన్‌వలి, ప్రసాద్, హఫీజ్, సంజీవరెడ్డి, వెంకటరాముడు, దేవదానమ్మ, శాంతమ్మ, నాగమణి, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గోలో ప్రతివారం లక్కీ డ్రా

అనంతపురం : ఏపీఎస్ ఆర్టీసీ నిర్వహిస్తున్న కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా ఈనెల 25 నుంచి నవంబర్ 26వ తేదీ వరకూ కార్గో డోర్ డెలివరీ బుక్ చేసుకునే వినియోగదారులకు ప్రతివారా లక్కీ డ్రా తీయనున్నట్లు రీజినల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆథోని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లక్కీ డ్రా తీయనున్న తేదీలు నవంబర్ 5, 12, 19, 26వ తేదీల్లో నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

సంస్కారం లేని మాధవ్.. నోరు అదుపులో పెట్టుకో..

శింగనమల : సంస్కారం లేని హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని తెలుగు యువత మాజీ జిల్లా కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. టిడిపి అధినేత చంద్రబాబుపై సంస్కారం లేని మాధవ్ చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. చదువుకుని పోలీసుగా ప్రజలకు సేవలు చేసి, రాజకీయంగా ప్రజాసేవ చేయాల్సిన మాధవ్ ఇలాంటి అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇలాంటివి పునరావృతమైతే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి ఓ పేద కుటుంబానికి మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. కన్నడ కథానాయకుడు, కీర్తిశేషులు పునీత్ రాజ్‌కుమార్ రెండవ వర్ధంతి సందర్భంగా ఆదివారం మున్నానగర్‌లోని కృష్ణమూర్తి, కుళ్లాయమ్మ దంపతులకు సరుకులు అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ మద్యానికి బానిసై అనారోగ్యం పాలైన కృష్ణమూర్తి కుటుంబ పరిస్థితి బాగాలేదన్నారు. దీంతో మూడు నెలలకు సరిపడా 22 రకాల వస్తువులు, రెండు ప్యాకెట్లు బియ్యాన్ని, పౌష్టికాహారం పౌడర్‌ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రాధా, రుక్మిణీ, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



సరుకులు అందజేస్తున్న నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు ఛైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి